సాక్షి
కుమురం భీం

బుధవారం ¦ 12 ¦ మార్చి ¦ 2025



కూరగాయల 'కన్నెపల్లి' 9లో▸

కౌటాల మండలం కన్నెపల్లిలో 250 కుటుంబాలు ఉండగా 150 కుటుంబాలు కూరగాయలు సాగు చేస్తున్నాయి. తక్కువ పెట్టుబడితో లాభాలు పొందుతున్నారు.



రంజాన్ వేళలు

ఇఫ్తార్	సహర్
బుధ : 6:21	గురు : 5:10

గరిష్టం/కనిష్టం
38.5 /23.6

వాతావరణం

ఉష్ణోగ్రతలు మరింత పెరుగుతాయి. మధ్యాహ్నం వేడి, ఉక్కపోత ఎక్కువగా ఉంటుంది. చలి ప్రభావం చాలావరకు తగ్గుతుంది. తెల్లవారుజామున చల్లగా ఉంటుంది.

న్యూస్‌రీల్

నాణ్యతతో పనులు చేపట్టాలి



మాట్లాడుతున్న ఎస్‌ఈ సూర్యప్రకాశ్

ఆసిఫాబాద్‌అర్బన్: ఉపాధిహామీ పథకం ద్వారా జిల్లాలో చేపడుతున్న పనుల్లో నాణ్యత పాటించాలని పంచాయతీరాజ్ విజిలెన్స్ అండ్ క్వాలిటీ కంట్రోల్ విభాగం ఎస్‌ఈ సూర్యప్రకాశ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం వివిధ మండలాల్లో ఉపాధిహామీ పథకం కింద పనులు చేపడుతున్న ఏజెన్సీ నిర్వాహకులు, అధికారులకు పంచాయతీరాజ్ ఈఈ ప్రభాకర్ అధ్యక్షతన అవగాహన సదస్సు నిర్వహించారు. ఎస్‌ఈ సూర్యప్రకాశ్ మాట్లాడుతూ నిర్దేశించిన సమయంలో పనులు పూర్తిచేయడంతోపాటు నాణ్యత ప్రమాణాలు పాటించినప్పుడే ప్రభుత్వ లక్ష్యం నెరవేరుతుందన్నారు. రానున్న రోజుల్లో నాణ్యత పరీక్షించిన తర్వాతే బిల్లుల చెల్లింపులు జరుగుతాయని స్పష్టం చేశారు. పనులు పూర్తిచేయడంలో అలసత్వం ప్రదర్శించొద్దని హెచ్చరించారు. సమావేశంలో డీఈ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి



వినతిపత్రం ఇస్తున్న నాయకులు

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లా కేంద్రంలో సమస్యలు పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని డీవైఎఫ్‌ఐ, టీఏజీఎస్ నాయకులు మంగళవారం కలెక్టరేట్‌లో ఏవో మధుకర్‌కు వినతిపత్రం అందించారు. నాయకులు కార్తీక్, మాలశ్రీ మాట్లాడుతూ జిల్లా కేంద్రానికి వచ్చే ప్రజలకు కనీస వసతులు కూడా లేవన్నారు. ట్రాఫిక్ సమస్యతో వాహనదారులు ఇబ్బంది పడుతున్నారని, వ్యాపారులు పగటిపూటే భారీ వాహనాలు రోడ్లపై నిలుపుతున్నారని ఆరోపించారు. గోదాంలను కాలనీల్లో కాకుండా బహిరంగ ప్రదేశాల్లో ఏర్పాటు చేయాలన్నారు. పట్టణంలో సులభ్ కాంప్లెక్స్‌లు, పార్కింగ్ స్థలాలు, తాగునీటి కోసం చలివేంద్రాలు, ఓపెన్ జిమ్‌లు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. జన్కాపూర్ మైదానానికి ప్రహరీ నిర్మించి, సెక్యూరిటీ పెంచాలన్నారు. నాయకులు శ్రావణి తదితరులు ఉన్నారు.

ప్రభుత్వ బడుల్లో నాణ్యమైన విద్య



అభ్యసన సామర్థ్యాలు పరీక్షిస్తున్న డీఈవో

తిర్యాణి(ఆసిఫాబాద్): ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని డీఈవో యాదయ్య అన్నారు. మండలంలోని రాంబాయిగూడ, కన్నెపల్లి ప్రాథమిక పాఠశాల, మాణిక్యపూర్‌లోని కస్తూరిబా గాంధీ విద్యాలయాన్ని మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు పరీక్షించారు. ఆయన మాట్లాడుతూ చదువులో వెనుకబడిన విద్యార్థులపై దృష్టి సారించాలని సూచించారు. మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం అందేలా చూడాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపైనే ఉందన్నారు.

వేసవిలో నిరంతరం విద్యుత్ సరఫరా చేయాలి



నూతన బ్రేకర్ ప్రారంభిస్తున్న ఎస్‌ఈ

రెబ్బెన: వేసవిలో ప్రజలకు ఇబ్బంది కలగకుండా నిరంతరం విద్యుత్ సరఫరా చేయాలని ట్రాన్స్‌కో ఎస్‌ఈ రాథోడ్ శేషారావు అన్నారు. మండలంలోని నంబాల సబ్‌స్టేషన్‌లో కొత్తగా ఏర్పాటు చేసిన బ్రేకర్‌ను మంగళవారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ వేసవిలో నాణ్యమైన విద్యుత్‌ను అందించేందుకు కొత్త బ్రేకర్‌ను ఏర్పాటు చేశామన్నారు. విద్యుత్ సరఫరాలో ఏమైనా సమస్యలు ఉత్పన్నమైతే సత్వరమే వాటిని పరిష్కరించి విద్యుత్ సరఫరాలో అంతరాయం రాకుండా చూడాలని సిబ్బందికి సూచించారు. డీఈఈ వీరేశం, ఏడీఈ ఫిరోజ్‌ఖాన్, సంతోష్, ఏఈ ఇమ్రాన్, సిబ్బంది రయీస్, సురేశ్, హరీశ్, సత్తయ్య, నసీరుద్దీన్, మధు పాల్గొన్నారు.

దాహం తీరేదెలా..?

- జిల్లాలో మండుతున్న ఎండలు
- అటవీ ప్రాంతాల్లో నీటి కరువు
- తాగునీటి కోసం మైదాన ప్రాంతాల్లోకి వన్యప్రాణులు
- పొంచి ఉన్న వేటగాళ్ల ముప్పు



పెంచికల్‌పేట్ రేంజ్‌లో నీరు లేక ఖాళీగా ఉన్న సాసర్‌పిట్

పెంచికల్‌పేట్(సిర్పూర్): మార్చిలోనే ఎండలు మండిపోతున్నాయి. పగటి ఉష్ణోగ్రతలు 40 డిగ్రీల సెల్సియస్‌కు చేరువయ్యాయి. వేడి, పొడి వాతావరణంతో అడవుల్లోని సహజ నీటి వనరులు క్రమంగా కనుమరుగవుతున్నాయి. ఫలితంగా అటవీ ప్రాంతాలను ఆవాసంగా చేసుకుని మనుగడ సాగిస్తున్న వన్యప్రాణులు తాగునీటికి అల్లాడుతున్నాయి. ఎండలు మొదలై 15 నుంచి 20 రోజులవుతున్నా అటవీశాఖ అధికారులు మాత్రం నీటి వసతి కల్పించేందుకు అవసరమైన చర్యలు చేపట్టడం లేదు. దాహానికి తట్టుకోలేక వన్యప్రాణులు నీటి వనరులను వెతుక్కుంటూ అడవులను విడిచి మైదాన ప్రాంతాలకు పరుగులు తీస్తున్నాయి. ఈ క్రమంలో అటవీ జంతువులు వేటగాళ్ల ఉచ్చులకు చిక్కుతున్నాయి. అలాగే వీధికుక్కల దాడిలోనూ ప్రాణాలు కోల్పోయే అవకాశం ఉంది.

6,04,172 ఎకరాల్లో అడవులు

జిల్లాలో ఆసిఫాబాద్, కాగజ్‌నగర్ ఫారెస్టు డివిజన్లు ఉన్నాయి. ఆయా డివిజన్లలో 11 రేంజ్‌లు, 79 సెక్షన్లు, 245 బీట్లు, 846 కంపార్టుమెంట్లు ఉన్నాయి. జిల్లావ్యాప్తంగా 6,04,172 ఎకరాల్లో అడవులు విస్తరించి ఉన్నాయి. పెద్దపులులు, చిరుతపులులు, ఎలుగుబంట్లు, జింకలు, మెకాలు, దుప్పులు, నీలుగాయి, కొండగొర్రెలు, అడవి పందులతోపాటు అనేక రకాల అరుదైన జంతువులు ఇక్కడ జీవనం సాగిస్తున్నాయి. దట్టమైన అడవుల్లో గడ్డి మైదానాలు, నీటి ఊటలు ఉన్నాయి. నిత్యం నీటితో కళకళలాడే పెన్‌గంగ, ప్రాణహిత నదులు, పెద్దవాగు వన్యప్రాణుల దాహం తీరుస్తున్నాయి. జిల్లాలోని ముఖ్యమైన ప్రాంతాల్లో అటవీ జంతువుల దాహం తీర్చడానికి అధికారులు 159 సాసర్‌పిట్లు, 19 సోలార్ నీటి కుంటలు ఏర్పాటు చేశారు. అయితే కొన్ని ప్రాంతాల్లో వేసవిలో నీటి వనరులు అడుగంటిపోతాయి. ఈ సమయంలో అధికారులు ఏర్పాటు చేసే నీటికుంటలు, సాసర్ పిట్‌లే వాటికి ఆధారం.

పొంచి ఉన్న ముప్పు..

ఎండాకాలంలో అడవి జంతువులకు నీటి సౌకర్యం కల్పించడం, వేటగాళ్ల బారి నుంచి కాపాడటం అధికారులకు సవాలుగా మారింది. అడవుల నుంచి దాహంతో మైదాన ప్రాంతాల్లోకి వస్తున్న వన్యప్రాణులకు వేటగాళ్ల నుంచి ముప్పు పొంచి ఉంది. నిరంతరం నీరు లభించే ప్రాంతాలు వేటగాళ్లకు అనుకూలంగా మారాయి. నీటివసతి ఉన్న ప్రాంతాల్లో విద్యుత్ తీగలు, ఉచ్చులు బిగించి వన్యప్రాణులను వేటాడుతున్నారు. మాంసాన్ని గుట్టుచప్పుడు కాకుండా ఇతర ప్రాంతాలకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. మార్చిలోనే పగటి ఉష్ణోగ్రతలు అధికంగా నమోదవుతున్నాయి. వేడికి అల్లాడుతున్న వన్యప్రాణులు ఏప్రిల్, మేలో వేటగాళ్ల ఉచ్చులకు బలయ్యే అవకాశం ఉందని జంతు ప్రేమికులు ఆందోళన చెందుతున్నారు.

ఖాళీగా సాసర్‌పిట్లు..

వన్యప్రాణుల దాహార్తిని తీర్చేందుకు అటవీశాఖ అధికారులు ఆయా రేంజ్‌ల పరిధిలో ఏర్పాటు చేసిన నీటికుంటలు, సాసర్‌పిట్లు, సోలార్ నీటి కుంటలు అలంకారప్రాయంగా కనిపిస్తున్నాయి. సాసర్‌పిట్లలో ట్యాంకర్ల ద్వారా వారం రోజులకు ఒకసారి నీటితో నింపాల్సి ఉన్నా అధికారులు పట్టించుకోవడం లేదు. వన్యప్రాణుల కోసం ఉప్పు గడ్డలు మాత్రం నీటి వసతి ఉన్న ప్రాంతాల్లో అందుబాటులో ఉంచారు. ఏడాదిగా కంపా నిధులు నిలిచిపోవడంతో అడవి జంతువుల దాహార్తి తీర్చడం అటవీశాఖ అధికారులకు భారంగా మారింది.

జిల్లా వివరాలు

ఫారెస్టు రేంజీలు	సాసర్ పిట్లు	సోలార్ కుంటలు
పెంచికల్‌పేట్	15	5
బెజ్జూర్	26	1
కాగజ్‌నగర్	22	8
సిర్పూర్(టి)	22	2
కర్జెల్లి	29	1
రెబ్బెన	10	2
ఆసిఫాబాద్	15	0
జోడేఘాట్	5	0
కెరమెరి	5	0
తిర్యాణి	5	0
గిన్నెధరి	5	0

ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నాం

ఎండల తీవ్రతతో అడవిలోని సహజ వనరులు ఎండిపోతున్నాయి. నీటి లభ్యత ఉన్న ప్రదేశాల్లో చెలిమెలు ఏర్పాటు చేస్తున్నాం. మార్చి నెలాఖరు వరకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నాం. ఇప్పటికే క్షేత్రస్థాయిలో ఉన్న పరిస్థితులు ఉన్నతాధికారులకు నివేదించాం. నిధులు రాగానే సాసర్‌పిట్లలో నీటిని నింపే ప్రక్రియ ప్రారంభిస్తాం. వన్యప్రాణులు మైదాన ప్రాంతాల్లోకి వస్తే అటవీశాఖ అధికారులకు సమాచారం అందించాలి. వన్యప్రాణులను వేటాడితే కేసులు నమోదు చేస్తాం.

– అనిల్‌కుమార్, ఎఫ్ఆర్‌వో, పెంచికల్‌పేట్

మహిళల అభ్యున్నతికి చర్యలు



బహుమతులు పొందిన విద్యార్థినులతో కలెక్టర్ వెంకటేశ్ దోత్రే, ఎమ్మెల్యే హరీశ్‌బాబు, తదితరులు

- కలెక్టర్ వెంకటేశ్ దోత్రే
- ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం

ఆసిఫాబాద్‌అర్బన్: మహిళల అభ్యున్నతి, రక్షణకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందని కలెక్టర్ వెంకటేశ్ దోత్రే అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో మంగళవారం జిల్లా స్త్రీ, శిశు, వయోవృద్ధులు, దివ్యాంగుల సంక్షేమశాఖ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు. ముందుగా అదనపు కలెక్టర్ దీపక్ తివారి, కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధా శుక్లా, సిర్పూర్ ఎమ్మెల్యే హరీశ్‌బాబుతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ మహిళలను ఆర్థిక స్వావలంబన దిశగా ప్రోత్సహిస్తున్నామని అన్నారు. చిన్న తరహా పరిశ్రమల స్థాపనకు బ్యాంకు లింకేజీ ద్వారా స్వశక్తి మహిళా సంఘాలకు రుణాలు అందిస్తున్నట్లు తెలిపారు. గృహహింస, లైంగిక వేధింపుల బాధితులకు సఖి కేంద్రం ద్వారా సాయం అందిస్తున్నామన్నారు. అదనపు కలెక్టర్ మాట్లాడుతూ బేటీ పడావో.. బేటీ బచావో కార్యక్రమం ద్వారా బాలికల్లో అక్షరాస్యత పెరిగిందని పేర్కొన్నారు. జిల్లాలో మోటివేషన్ స్పీకర్లను నియమించినట్లు తెలిపారు. భావితరాలకు మహిళలు ఆదర్శంగా నిలవాలని, ఉన్నత లక్ష్యాలు సాధించాలని కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధా శుక్లా సూచించారు. అనంతరం ఎమ్మెల్యే హరీశ్‌బాబు మాట్లాడుతూ మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించినప్పుడే కుటుంబం, సమాజం వారిని గుర్తిస్తుందన్నారు. ఆత్మనూన్యత భావన విడిచి ముందడుగు వేయాలని సూచించారు. భ్రూణ హత్యలు, బాల్యవివాహాలు అరికట్టినప్పుడే సమాజం అభివృద్ధి వైపు పయనిస్తుందని పేర్కొన్నారు. మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని పలువురు మహిళలను ఘనంగా సత్కరించారు. క్రీడల్లో గెలుపొందిన విద్యార్థినులకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి భాస్కర్, సీడీపీవోలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



సబ్ కలెక్టర్ శ్రద్ధా శుక్లాను సన్మానిస్తున్న కలెక్టర్ వెంకటేశ్ దోత్రే, అధికారులు

నెలాఖరులోగా పనులు పూర్తిచేయాలి

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లాలో చేపడుతున్న అభివృద్ధి పనులు ఈ నెలాఖరులోగా పూర్తిచేయాలని కలెక్టర్ వెంకటేశ్ దోత్రే అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమావేశ మందిరం నుంచి మంగళవారం అదనపు కలెక్టర్ దీపక్ తివారి, డీఆర్‌డీవో దత్తారావుతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా పంచాయతీ, హౌజింగ్ అధికారులు, ఎంపీడీవోలు, ఎంపీవోలు, ఏపీవోలు, పంచాయతీ కార్యదర్శులతో అభివృద్ధి పనుల పురోగతిపై సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ ముందస్తు ప్రణాళికతో తాగునీటి సమస్య లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. పంచాయతీల్లో ఏర్పాటు చేసిన నర్సరీల్లో మొక్కల సంరక్షణపై దృష్టి సారించాలన్నారు. మున్సిపాలిటీలు, గ్రామ పంచాయతీల్లో వందశాతం ఆస్తిపన్నులు వసూలు చేసేలా అధికారులు పర్యవేక్షించాలని ఆదేశించారు. లేఅవుట్ లేని భూముల క్రమబద్ధీకరణ కోసం ఎల్ఆర్ఎస్– 2020లో భాగంగా అందిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టి తదుపరి చర్యలు తీసుకోవాలని సూచించారు. అర్హత గల వారికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని, జాబ్ కార్డు కలిగిన వారికి వందరోజుల ఉపాధిహామీ పనులు కల్పించాలన్నారు. వేసవి నేపథ్యంలో ఉదయం, సాయంత్రం పనులు చేయించాలని సూచించారు. ఈ సమావేశంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్ దోత్రే

టాలెంట్ టెస్ట్ ఫలితాలు విడుదల

ఆసిఫాబాద్‌రూరల్: ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులకు ఇటీవల నిర్వహించిన టాలెంట్ టెస్ట్ ఫలితాలను జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో మంగళవారం కలెక్టర్ వెంకటేశ్ దోత్రే ఆ సంఘం నాయకులతో కలిసి విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ పదో తరగతి విద్యార్థుల ప్రతిభ గుర్తించేందుకు ఈ టెస్టు ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు సాయికుమార్, ప్రధాన కార్యదర్శి సాయికృష్ణ, నాయకులు సతీష్, బాలాజీ పాల్గొన్నారు.



ఫలితాలు విడుదల చేస్తున్న కలెక్టర్, నాయకులు

డోర్లి–2 ఓసీపీ సందర్శన

రెబ్బెన(ఆసిఫాబాద్): బెల్లంపల్లి ఏరియాలో మూసివేసిన డోర్లి– 2 ఓసీపీని మంగళవారం కోల్ కంట్రోల్ అధికారులు సందర్శించారు. నాగ్‌పూర్ కోల్ కంట్రోల్ కార్యాలయ ఓఎస్‌డీ సందీప్ ఎస్ పరాంజపేతో పాటు కొత్తగూడెం కోల్ కంట్రోల్ కార్యాలయ ఓఎస్‌డీ డీవీ సుబ్రమణ్యం ఏరియా అధికారులతో కలిసి మూతపడిన గని, పరిసర ప్రాంతాల్లో సింగరేణి యాజమాన్యం చేపట్టిన పర్యావరణ పనులు, ఓసీపీ వద్ద నాటిన మొక్కలు, ఎదిగిన వృక్షాలను పరిశీలించారు. పరిసర ప్రాంతాల్లో చేపడుతున్న నీటి నిర్వహణ, మృతిక సంరక్షణ చర్యల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అంతకు ముందు గోలేటి టౌన్‌షిప్‌లోని జీఎం కార్యాలయంలో ఇన్‌చార్జి జీఎం నరేందర్ కోల్ కంట్రోల్ అధికారులకు ఏరియా స్థితిగతుల వివరాలను వెల్లడించారు. కార్యక్రమాల్లో ఎస్‌వోటూజీఎం రాజమల్లు, ఏరియా సర్వే అధికారి అప్సర్ పాషా, డీవైఎస్‌వో శేఖర్, కార్పొరేట్ అదనపు మేనేజర్లు తిరుపతి, బాబ్జీ, డోర్లి– 2 మేనేజర్ మహేశ్, ఎన్విరాన్‌మెంట్ అధికారి హరీశ్, ఫారెస్టు అధికారి రమణారెడ్డి, ఎస్టేట్ అధికారి రజినీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



పరిసరాలు పరిశీలిస్తున్న కోల్ కంట్రోల్ అధికారులు

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం



సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ వైద్య కళాశాలకు స్వాతంత్య్ర సమరయోధుడు, తెలంగాణ ఉద్యమకారుడు కొండాలక్ష్మణ్ బాపూజీ పేరును నామకరణం చేయడంపై హర్షం వ్యక్తం చేస్తూ మంగళవారం అంబేడ్కర్ చౌక్ వద్ద పద్మశాలీ సేవా సంఘం సభ్యులు సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. జిల్లా అధ్యక్షుడు ఇరుకుల ఆంజనేయులు మాట్లాడుతూ వాంకిడి మండల కేంద్రానికి చెందిన కొండాలక్ష్మణ్ బాపూజీ ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం పదవులు సైతం లెక్కచేయలేదన్నారు. వాంకిడిలో సేవాసదన్ సంస్థకు చెందిన భూమిలో బాపూజీ స్మృతి వనం ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఇందుకోసం ఎమ్మెల్సీ దండె విఠల్ రూ.30లక్షలు కేటాయించారని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు శంకర్, శ్రీకాంత్, లింగయ్య, పుష్పలత, సునీత, ఇరుకుల మంగ, ప్రణయ్, భద్రయ్య, శ్యాం, శైలేందర్, శ్రీనివాస్, ధర్మయ్య, సత్యనారాయణ, మహేష్, మాలి సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు నాగోసె శంకర్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లాకు ఇంటిగ్రేటెడ్ గురుకులం

- ఆసిఫాబాద్ నియోజకవర్గంలో ఏర్పాటు
- వాంకిడి మండలం ఇందాని శివారులో స్థలం పరిశీలన
- రూ.200 కోట్లు మంజూరు చేసిన రాష్ట్ర ప్రభుత్వం



ఇందాని సమీపంలో స్థలాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ దీపక్ తివారి (ఫైల్)

ఆసిఫాబాద్‌రూరల్: పేదరికాన్ని రూపుమాపే ఏకైక ఆయుధం విద్య మాత్రమే.. పేద కుటుంబాల్లోని విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా యంగ్ ఇండియా ప్రోగ్రాంలో భాగంగా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్ల ఏర్పాటుకు శ్రీకారం చుట్టింది. ప్రతీ నియోజకవర్గానికి ఒకటి చొప్పున వీటిని ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా ఆసిఫాబాద్ నియోజకవర్గంలో సమీకృత గురుకుల పాఠశాల ఏర్పాటుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఇప్పటికే వాంకిడి మండలం ఇందాని సమీపంలో ప్రభుత్వ స్థలాన్ని ఇటీవల అదనపు కలెక్టర్ దీపక్ తివారి, ఆర్డీవో లోకేశ్వర్‌రావు, అధికారులు తదితరులు పరిశీలించారు. ఇంటిగ్రేటెడ్ గురుకులం నిర్మాణం కోసం ప్రభుత్వం రూ.200 కోట్లు మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

స్థలం గుర్తింపు

బడుగు, బలహీన వర్గాల విద్యార్థులకు అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన విద్యనందించేందుకు 25 ఎకరాల విస్తీర్ణంలో విశాలమైన భవనాలు నిర్మించనున్నారు. ఎస్సీ, బీసీ, ఎస్టీ, మైనార్టీ వర్గాలకు చెందిన విద్యార్థులందరూ ఒకే చోట చదువుకునేందుకు వీలుగా వసతులు కల్పించనున్నారు. ఆర్థికంగా వెనుకబడిన ఆదివాసీ జిల్లాలో సమీకృత గురుకుల పాఠశాల ఏర్పాటు చేస్తుండటంపై స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. 25 ఎకరాల స్థలం అందుబాటులో లేకపోవడంతో వాంకిడి మండలం ఇందాని గ్రామ శివారులో 321 సర్వే నంబర్‌లో 20 ఎకరాల స్థలాన్ని గుర్తించినట్లు అధికారులు వెల్లడించారు. మరోవైపు జిల్లా కేంద్రానికి సమీపంలో నిర్మిస్తే అన్ని మండలాల విద్యార్థులకు అందుబాటులో ఉంటుందని విద్యార్థి సంఘాల నాయకులు పేర్కొంటున్నారు. అలాగే సిర్పూర్ నియోజకవర్గంలో సమీకృత గురుకుల పాఠశాల ఏర్పాటుపై స్పష్టత రావాల్సి ఉంది.

జిల్లాలో పరిస్థితి..

జిల్లావ్యాప్తంగా ప్రస్తుతం ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలలు, గురుకులాలు కలిపి మొత్తం 1,265 ఉన్నాయి. ఇందులో కళాశాలలు 17, పాఠశాలలు 1,248. ప్రస్తుత విద్యా సంవత్సరంలో ఆయా చోట్ల 1,03,264 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. ఐదు సాంఘిక సంక్షేమ గురుకులాల్లో 2,898 మంది విద్యార్థులు, ఏడు గిరిజన సంక్షేమ గురుకులాల్లో 2,917 మంది, 38 ఆశ్రమ పాఠశాలల్లో 7,065 మంది, 15 కేజీబీవీల్లో 3,917 మంది, ఐదు బీసీ జ్యోతిబా పూలే గురుకులాల్లో 2,215 మంది, మూడు మైనార్టీ గురుకుల పాఠశాలల్లో 1,185 మంది, రెండు మోడల్ స్కూళ్లలో 1,304 మంది, 19 ఎస్సీ, బీసీ పోస్టు మెట్రిక్, ప్రీమెట్రిక్ వసతి గృహాలు, ఎస్సీ బాలబాలికల వసతి గృహాల్లో 385 మంది, 11 బీసీ వసతి గృహాల్లో 789 మంది, 107 ప్రైవేట్ పాఠశాలల్లో 29,779 మంది, 732 ప్రభుత్వ పాఠశాలల్లో 43,110 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు.

జిల్లా కేంద్రానికి సమీపంలో ఉండాలి



ఆసిఫాబాద్‌కు సమీపంలో చాలా వరకు ప్రభుత్వ భూములు ఉన్నాయి. జిల్లా కేంద్రం పరిధిలో ఐదు కి.మీ.ల దూరంలో సమీకృత గురుకులం ఏర్పాటు చేస్తే విద్యార్థులకు అందుబాటులో ఉంటుంది. ఆదర్శ డిగ్రీ కళాశాలను బెండారలో ఏర్పాటు చేయడంతో దూరభారంతో విద్యార్థులు వెళ్లేందుకు ఆసక్తి చూపడం లేదు.

– తిరుపతి, పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి

విద్యార్థులకు సమస్యలు రానీయొద్దు

వాంకిడి(ఆసిఫాబాద్): బీసీ, ఎస్సీ వసతిగృహాల్లో చదువుతున్న విద్యార్థులకు ఎలాంటి సమస్యలు రానీయొద్దని జిల్లా బీసీ అభివృద్ధి అధికారి సజీవన్ అన్నారు. మండల కేంద్రంలోని ఎస్సీ, బీసీ వసతిగృహాలను మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టోర్ రూం, వంటగది, రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తప్పనిసరిగా మెనూ పాటిస్తూ ప్రతిరోజూ ఆరోగ్యకరమైన భోజనం అందించాలన్నారు. వసతిగృహాల్లో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. విద్యార్థులకు ఉదయం, సాయంత్రం స్టడీ అవర్స్ నిర్వహించాలని సూచించారు. పదో తరగతి విద్యార్థులు పూర్తినమ్మకంతో కష్టపడి చదవాలన్నారు. పరీక్షల తీరుపై అవగాహన కల్పించారు. ఆయన వెంట బీసీ హాస్టల్ వార్డెన్ మధుకర్, ఎస్సీ హాస్టల్ వార్డెన్ తిరుపతి తదితరులు ఉన్నారు.



స్టడీ అవర్స్ నిర్వహిస్తున్న సజీవన్

క్లుప్తంగా

పీడీఎస్ బియ్యం పట్టివేత

నస్పూర్: నస్పూర్ నుంచి కాగజ్‌నగర్ వైపు అక్రమంగా తరలిస్తున్న పీడీఎస్ బియ్యాన్ని మంగళవారం పట్టుకున్నట్లు టాస్క్‌ఫోర్స్ సీఐ రాజ్‌కుమార్, ఎస్సై ఉపేందర్ తెలిపారు. బియ్యం సుమారు 70 క్వింటాళ్లు ఉంటాయని తెలిపారు. తరలిస్తున్న పాస్తం రాములు, బియ్యాన్ని, డీసీఎం వ్యానును తదుపరి విచారణ నిమిత్తం సీసీసీ నస్పూర్ పోలీసులకు అప్పగించామని తెలిపారు.

మందమర్రిరూరల్: పట్టణంలోని విద్యానగర్, ఎస్సీ, ఎస్టీ కాలనీల్లోని పలు ఇళ్లలో మంగళవారం కరీంనగర్ విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్, జిల్లా సివిల్ సప్లయ్ అధికారులు దాడులు నిర్వహించి 70 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పట్టుకున్నారు. పురాణం రవి, టేకి కనుకయ్య, మోటం రాజు నిలువ ఉంచినట్లు పేర్కొన్నారు. సమీపంలోని రేషన్ డీలర్‌కు అప్పగించినట్లు జిల్లా సివిల్ సప్లయ్ డీటీ ఆలం పోచయ్య తెలిపారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ ప్రశాంత్, అనిల్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

గుడుంబా స్వాధీనం

లక్సెట్టిపేట: మండలంలోని తిమ్మాపూర్‌లో అక్రమంగా నిలువ ఉంచిన గుడుంబాను మంగళవారం పట్టుకున్నట్లు ఎక్సైజ్ సీఐ సమ్మయ్య తెలిపారు. తమకు అందిన సమాచారం మేరకు గ్రామానికి చెందిన ఉమ అనే మహిళ ఇంట్లో తనిఖీ చేయగా లీటర్ గుడుంబా లభించడంతో స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

కార్మికునికి గాయాలు

మందమర్రిరూరల్: ఏరియాలోని కేకే–5 గనిలో విధులు నిర్వహిస్తున్న శివసాయి అనే బదిలీ వర్కర్‌కు గాయాలయ్యాయి. మంగళవారం మొదటి షిఫ్టులోని పనిస్థలం వద్ద కిందపడిన టబ్బులను పైకి ఎత్తే క్రమంలో కార్మికుని చేయి టబ్బుకింద ఉండడంతో ప్రమాదం చోటు చేసుకుంది. ఘటనలో కార్మికుని కుడిచేయి ఉంగరపు వేలు తెగిపోయినట్లు తెలిపారు. వెంటనే తోటి కార్మికులు రామకృష్ణాపూర్ ఆసుపత్రికి తరలించారు.

హెచ్‌ఎంపై పోక్సో కేసు

మంచిర్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని గిరిజన ఆశ్రమ పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు నైతం శ్రీనివాస్‌పై పోక్సో కేసు నమోదు చేసినట్లు సీఐ ప్రమోద్‌రావు తెలిపారు. బాధితురాలి కుటుంబ సభ్యులు మంగళవారం కలెక్టర్ కుమార్ దీపక్‌ను కలిసి శ్రీనివాస్‌పై లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేయడం చర్చనీయాంశమైంది. ఇటీవల ఓ ఉపాధ్యాయురాలిని వేధింపులకు గురి చేసినందుకు ఈ నెల 5న రామకృష్ణాపూర్ పోలీస్ స్టేషన్లో సైతం కేసు నమోదైంది. అతనిపై చట్టపరమైన చర్యలు తీసుకోవడంతో పాటు శాశ్వతంగా సర్వీస్‌లో నుంచి తొలగించాలని విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేస్తున్నారు.

వైద్యురాలు శృతికి సన్మానం


సన్మానిస్తున్న సభ్యులు

మంచిర్యాలటౌన్: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం పట్టణంలోని వైశ్యభవన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వివిధ రంగాలలో విశిష్ట సేవలందించిన మహిళలను మంచిర్యాల వాసవీ వనిత క్లబ్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. వైద్య రంగంలో ఉత్తమ సేవలు అందించిన బర్త్‌రూట్ ఆస్పత్రి వైద్యురాలు శృతి గోలిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో వాసవీ వనిత క్లబ్ అధ్యక్షురాలు మల్యాల సంగీత, సెక్రటరి కే.గాయత్రి, కోశాధికారి గుండా సునీత పాల్గొన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

SERVICES

BUSINESS OFFER

■ మీరు లాభదాయకమైన వ్యాపారాన్ని ప్రారంభించండి, లేడీస్ శానిటరీ ప్యాడ్, బేబి డైపర్ మెషిన్, ప్లాస్టిగ్ ఉద్యోగ్ స్థాపించండి, బైబ్యాక్ అగ్రిమెంట్‌తో (ప్రభుత్వంచే ఆమోదించబడినది) సంప్ర॥ 8376001873, 9643010487, 8376089771, 011-25920179 [DA-6239]

WANTED

■ Universal కంపెనీకి వర్క్ చేయుటకు స్త్రీ/పు కావలెను. జీతం: 25,000 నుండి 30,000 వరకు సంపాదించుకోండి. అడ్రస్ వాట్సాప్ చేయండి. సెల్ : 95504 67459. [SCA 25002107]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classifieds, Advertisements Contact:
9951602888
9010299065
9951602823
9010608462

గ్రూప్–2లో మెరిసిన మనోళ్లు

టీజీపీఎస్సీ మంగళవారం విడుదల చేసిన గ్రూప్–2 పరీక్ష ఫలితాల్లో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అభ్యర్థులు సత్తా చాటారు. ఇప్పటికే ప్రభుత్వ ఉద్యోగం చేస్తున్న వారుసైతం పోటీ పరీక్షలకు సన్నద్ధమై ఉత్తమ ర్యాంకులు సాధించారు. వీరంతా సర్టిఫికెట్ వెరిఫికేషన్ తర్వాత ఉద్యోగ నియామక పత్రాలు అందుకోనున్నారు.

- ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వాసులకు ర్యాంకులు


అశోక్ కుమార్‌ను అభినందిస్తున్న కుటుంబ సభ్యులు

250 ర్యాంక్ సాధించిన అశోక్‌కుమార్

తాంసి: మండల కేంద్రానికి చెందిన జానకొండ అశోక్ కుమార్ గ్రూప్–2లో ఫలితాల్లో 380 మార్కులతో రాష్ట్రస్థాయిలో 250వ ర్యాంక్ సాధించాడు. ప్రస్తుతం జైనథ్ మండలం సుందరగిరి గ్రామ పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్నాడు. సోమవారం విడుదలైన గ్రూప్–1 ఫలితాల్లో 399 మార్కులు సాధించాడు. సోదరుడు శ్రీకాంత్ అందించిన సహకారంతో గ్రూప్–1, 2 పరీక్షలకు సన్నద్ధమై విజయం సాధించినట్లు అశోక్ కుమార్ పేర్కొంటున్నాడు.

337వ ర్యాంకు సాధించిన వెంకటేశ్



నస్పూర్: మంచిర్యాల జిల్లా నస్పూర్‌కు చెందిన పోలంపల్లి వెంకటేశ్ గ్రూప్–2 ఫలితాల్లో 375 మార్కులతో రాష్ట్రస్థాయిలో 337వ ర్యాంకు సాధించాడు. 2014లో నిర్వహించిన వీఆర్‌వో పరీక్షలలో ఉమ్మడి జిల్లా టాపర్‌గా నిలిచాడు. కొంత కాలం నస్పూర్ తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్‌ఏగా విధులు నిర్వహించాడు. ప్రస్తుతం లక్సెట్టిపేట మోడల్ డిగ్రీ కళాశాలలో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్నాడు.

సత్తా చాటిన యువకులు


సురేష్‌రెడ్డి


సుమంత్

నెన్నెల: మంచిర్యాల జిల్లా నెన్నెల మండలంలోని ఆవుడం గ్రామానికి చెందిన యువకులు గ్రూప్–2 ఫలితాల్లో సత్తా చాటారు. చీర్ల లక్ష్మయ్య–రమక్క దంపతుల కుమారుడు సురేష్‌రెడ్డి రాష్ట్రస్థాయిలో 55వ ర్యాంకు సాధించగా మండల మురళిగౌడ్, ఉష దంపతుల కుమారుడు సుమంత్ 172వ ర్యాంకు సాధించాడు. సురేష్‌రెడ్డి ప్రస్తుతం సింగరేణిలో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తూనే గ్రూపు–2లో ర్యాంకు సాధించాడు. సుమంత్ ప్రస్తుతం జీహెచ్‌ఎంసీలో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్నాడు.

19వ ర్యాంక్ శివకృష్ణ



ఆసిఫాబాద్‌అర్బన్/ఆసిఫాబాద్‌రూరల్: కుమురంభీం జిల్లా కేంద్రానికి చెందిన శ్రీరామ్ సత్యనారాయణ, వాణిశ్రీ దంపతుల కుమారుడు శివకృష్ణ గ్రూప్–2 ఫలితాల్లో రాష్ట్రస్థాయిలో 19వ ర్యాంకు, జోన్‌స్థాయిలో 4వ ర్యాంకు సాధించాడు. సత్యనారాయణ స్థానిక సరస్వతి శిశుమందిర్‌లో ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తుండగా శివకృష్ణ అదే పాఠశాలలో చదివి ట్రిపుల్ ఐటీలో సీటు సాధించాడు. గతేడాది ప్రకటించిన గ్రూప్–4 ఫలితాల్లో రాష్ట్రంలోనే మొదటి ర్యాంకు సాధించగా ప్రస్తుతం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో ఆడిట్ సెక్షన్‌లో విధులు నిర్వర్తిస్తున్నారు.

97వ ర్యాంక్ లెక్కల శ్రావణ్


శ్రావణ్‌కుమార్

మంచిర్యాలరూరల్ (హాజీపూర్): మంచిర్యాల జిల్లా హాజీపూర్ మండలం గుడిపేటకు చెందిన లెక్కల లింగయ్య, కళావతి దంపతుల కుమారుడు శ్రావణ్‌కుమార్ గ్రూప్–2 ఫలితాల్లో రాష్ట్రస్థాయిలో 97వ ర్యాంక్ సాధించాడు. 2019లోనే జిల్లాస్థాయిలో మొదటి ర్యాంక్, రాష్ట్రస్థాయిలో 10వ ర్యాంక్‌తో పంచాయతీ కార్యదర్శిగా ఉద్యోగం సాధించిన శ్రావణ్ సంతృప్తి లేకపోవడంతో ఉద్యోగానికి రాజీనామా చేశాడు. గతేడాది గ్రూప్–4లో జిల్లాస్థాయిలో 11వ ర్యాంక్ సాధించి బెల్లంపల్లి తహసీల్దార్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్నాడు. ప్రస్తుతం విడుదల చేసిన గ్రూప్–2 ఫలితాల్లో 394 మార్కులతో రాష్ట్రస్థాయిలో 97వ ర్యాంక్ సాధించాడు. గ్రూప్–1లోనూ 404 మార్కులు సాధించాడు.

188వ ర్యాంకు సాయికృష్ణ



సారంగపూర్: నిర్మల్ జిల్లా సారంగపూర్ మండలంలోని బీరవెల్లి గ్రామానికి చెందిన బట్టు నర్సన్న–సురేఖ దంపతుల కుమారుడు సాయికృష్ణ గ్రూప్–2 ఫలితాల్లో 188వ ర్యాంకు సాధించి తన సత్తా చాటుకున్నాడు. నర్సన్న స్థానికంగా బిజినెస్ చేస్తుండగా సురేఖ దేగాం ఉన్నత పాఠశాలలో పీడీగా విధులు నిర్వర్తిస్తున్నారు. చిన్నతనం నుంచి చదువుపై ఆసక్తి ఉన్న సాయికృష్ణ ఇంటర్ హైదరాబాద్‌లోని శ్రీచైతన్య జూనియర్ కళాశాలలో, ఢిల్లీలో బీటెక్ పూర్తి చేసి తొలి ప్రయత్నంలోనే గ్రూప్–2లో విజయం సాధించాడు. తల్లిదండ్రులు, గురువుల సహకారంతోనే విజయం సాధించానని పేర్కొన్నాడు.

191 ర్యాంకు సాయిరాం



కౌటాల: కుమురంభీం జిల్లా కౌటాల మండలంలోని తలోడి గ్రామానికి చెందిన మండల రాజేశం గౌడ్–తారక్క దంపతుల కుమారుడు సాయిరాం గౌడ్ గ్రూప్–2లో 383 మార్కులతో రాష్ట్రస్థాయిలో 191 ర్యాంకు సాధించాడు. సాయిరాం ప్రస్తుతం బెజ్జూర్ మండలం మొగవెల్లి పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్నాడు. గ్రూప్–4లో రెవెన్యూ జూనియర్ అసిస్టెంట్‌గా సెలెక్ట్ కావడంతో పాటు గ్రూప్–1 మెయిన్స్‌లో 436 మార్కులు సాధించాడు.

మెరిసిన 'బజార్‌హత్నూర్' యువకులు


ఉదయ్‌కుమార్


బుద్దేవార్ ముఖేష్

బజార్‌హత్నూర్: ఆదిలాబాద్ జిల్లా బజార్‌హత్నూర్ మండల కేంద్రానికి చెందిన బిట్లింగు లక్ష్మణ్, సరస్వతి దంపతుల కుమారుడు ఉదయ్‌కుమార్ 404 మార్కులతో రాష్ట్రస్థాయిలో 51వర్యాంకు సాధించాడు. ఉదయ్ ప్రస్తుతం ఆదిలాబాద్ ట్రెజరీలో జూనియర్ అకౌంటెంట్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. మండలంలోని కొలారి గ్రామానికి చెందిన బుద్దేవార్ రాధ, నర్సింహులు దంపతుల కుమారుడు బుద్దేవార్ ముఖేష్ గ్రూప్–2 ఫలితాల్లో 418 మార్కులతో రాష్ట్రస్థాయిలో 15వ ర్యాంకు సాధించాడు. 2019లో పంచాయతీ కార్యదర్శి, 2021లో నీటిపారుదల శాఖలో జూనియర్ అసిస్టెంట్ ఉద్యోగం సాధించాడు.

గ్రూప్–1 ఫలితాల్లో సత్తా



నిర్మల్‌ఖిల్లా: నిర్మల్ జిల్లా కేంద్రానికి చెందిన ఎర్రవోతు శ్యామల, ముత్తన్న దంపతుల కుమారుడు సాయి ప్రణయ్ టీజీపీఎస్సీ ఇటీవల విడుదల చేసిన ఫలితాల్లో 557 మార్కులు సాధించి రాష్ట్రస్థాయిలో ప్రతిభ కనబరిచాడు. సాయి ప్రణయ్ ఒకటి నుంచి ఏడో తరగతి వరకు స్థానిక సెయింట్ థామస్ పాఠశాలలో, 8 నుంచి 10 వరకు హైదరాబాద్‌లోని గురుకులంలో, ఇంటర్ నారాయణ జూనియర్ కాలేజీలో, బీటెక్ సీఎంఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో పూర్తి చేశాడు. గతేడాది నిర్వహించిన గ్రూప్–1 ప్రిలిమ్స్, మెయిన్స్ పరీక్షలకు హాజరయ్యాడు. తాజాగా వెల్లడైన ఫలితాల్లో అత్యున్నత మార్కులు సాధించాడు.

గోలేటివాసికి 229వ ర్యాంకు


భాస్కర్

రెబ్బెన: కుమురంభీం జిల్లా కౌటాల మండలంలోని గుడ్లబోరికి చెందిన కామ్రే రావూజీ, లహనుబాయి దంపతుల కుమారుడు భాస్కర్ రాష్ట్రస్థాయిలో 229వ ర్యాంకు సాధించాడు. ప్రస్తుతం బెల్లంపల్లి ఏరియాలోని ఏరియా స్టోర్స్‌లో సీనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. ఒకవైపు ఉద్యోగ బాధ్యతలు నిర్వహిస్తూనే మరోవైపు గ్రూప్–2 కోసం సంసిద్ధమయ్యాడు. ఆన్‌లైన్‌లో కోచింగ్, సొంత ప్రిపరేషన్‌తో గ్రూప్–2 ఫలితాల్లో 381.065 మార్కులు సాధించి రాష్ట్ర స్థాయిలో 229 ర్యాంకు సాధించాడు. కష్టపడి చదివితే విజయం దానంతట అదే వస్తుందని భాస్కర్ అంటున్నాడు.

యువకుడు ఆత్మహత్య

నెన్నెల: ఉరేసుకుని యువకుడు బలవన్మరణం చెందిన సంఘటన మండల కేంద్రంలో చోటు చేసుకుంది. ఎస్సై ప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రంలోని పోచమ్మవాడకు చెందిన అబ్బర్ల మహేష్(21) కొంతకాలంగా వింతగా ప్రవర్తిస్తున్నాడు. తనను ఎవరైనా ఏమైనా చేస్తారని భయపడుతుండేవాడు. సోమవారం మధ్యాహ్నం ఇంటి వద్ద ఆత్మహత్యకు యత్నించగా కుటుంబ సభ్యులు అడ్డుకున్నారు. రాత్రి అందరూ నిద్రపోయాక ఇంటి నుంచి పారిపోయాడు. మంగళవారం ఉదయం మామిడితోటలో చెట్టుకు ఉరేసుకుని కనిపించాడు. మృతుని తండ్రి అబ్బర్ల విజయ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై వివరించారు.

సెల్‌ఫోన్‌తో ఆడొద్దన్నారని విద్యార్థి బలవన్మరణం

బెల్లంపల్లిరూరల్: ఇంటర్మీడియెట్ వార్షిక పరీక్షలు జరుగుతున్నాయని, సెల్‌ఫోన్‌తో ఆడకుండా చదువుకోవాలని తల్లిదండ్రులు మందలించారని ఓ ఇంటర్ విద్యార్థి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన బెల్లంపల్లి మండలం పెర్కపల్లి గ్రామంలో చోటు చేసుకుంది. తాళ్లగురిజాల ఎస్సై రమేష్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని పెర్కపల్లి గ్రామానికి చెందిన మోటపలుకుల స్వామి, సునీత దంపతుల కుమారుడు మనోజ్‌కుమార్ ఇంటర్ సెకండియర్ చదువుతున్నాడు. ఈ నెలలో ప్రారంభమైన పరీక్షలకు హాజరవుతున్నాడు. ఈ నెల 9న సెల్‌ఫోన్‌తో ఆడుతుండగా తల్లిదండ్రులు పరీక్షలకు సిద్ధం కాకుండా ఆటలు ఏమిటని మందలించారు. దీంతో మనస్తాపం చెందిన మనోజ్‌కుమార్ ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగాడు. బెల్లంపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి అక్కడి నుంచి వరంగల్ ఎంజీఎంకు తరలించారు. చికిత్స పొందుతూ మంగళవారం తెల్లవారుజామున మనోజ్‌కుమార్(18) మృతిచెందాడు. కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై వివరించారు.

కేవీకేలో 'రైతు నేస్తం'

బెల్లంపల్లి: బెల్లంపల్లిలోని కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే)లో మంగళవారం రైతు నేస్తం కార్యక్రమాన్ని రాష్ట్ర వ్యవసాయ విశ్వ విద్యాలయం ఉపకులపతి ఆల్దాస్ జానయ్య ఆన్‌లైన్ ద్వారా ప్రారంభించారు. రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రోగ్రాం కోఆర్డినేటర్ కోట శివకృష్ణ, శాస్త్రవేత్తలు తిరుపతి, నాగరాజు, స్రవంతి పాల్గొన్నారు.

ఎస్టీపీపీకి అవార్డు


మిషన్ ఎనర్జీ ఫౌండేషన్ ద్వారా గోవాలో అవార్డు అందుకుంటున్న ఎస్టీపీపీ డీజీఎం మహేందర్

జైపూర్: మంచిర్యాల జిల్లా జైపూర్‌లోని సింగరేణి థర్మల్ పవర్ ప్లాంటు(ఎస్టీపీపీ)ను మరో అవార్డు వరించింది. మిషన్ ఎనర్జీ ఫౌండేషన్ నిర్వహించిన జాతీయ ఎఫీషియెన్సీ అవార్డ్స్–2025లో భాగంగా ఏడో సంవత్సరానికి గాను నెట్ హీట్ రేట్ తగ్గింపు కేటగిరీలో 1000మెగావాట్లపైన గల దక్షిణ భారత థర్మల్ పవర్ ప్లాంట్లలో ఎస్టీపీపీకి బెస్ట్ ఎనర్జీ ఎఫీషియెంట్ ప్లాంటు–2025 అవార్డు లభించింది. ఒక కిలోవాట్ అవర్ విద్యుత్ ఉత్పత్తికి అవసరమయ్యే హీట్‌ను నెట్ హీట్ రేట్‌గా పరిగణిస్తారు. హీట్ రేట్ ఎక్కువగా ఉంటే బొగ్గు వినియోగం కూడా పెరిగి తద్వారా ఉత్పత్తి వ్యయం కూడా పెరుగుతుంది. ఎస్టీపీపీలో వినియోగిస్తున్న సాంకేతికత వల్ల తక్కువ హీట్ రేట్‌తోనే ఒక కిలోవాట్ అవర్ విద్యుత్‌ను ఉత్పత్తి చేస్తున్నారు. ఈ మేరకు ఎస్టీపీపీ నుంచి డీజీఎం మహేందర్ గోవాలో సోమవారం జరిగిన కార్యక్రమంలో అవార్డు అందుకున్నారు. వరుసగా అవార్డు అందుకోవడంపై సంస్థ డైరెక్టర్ సత్యనారాయణ ఇంచార్జీ ఈడీ శ్రీనివాసులు అధికారులు, ఉద్యోగులను అభినందించారు.

నీళ్లివ్వలేదని మహిళపై గొడ్డలితో దాడి

మందమర్రిరూరల్: తాగేందుకు నీళ్లు ఇవ్వలేదని మద్యం మత్తులో మహిళపై గొడ్డలితో దాడికి పాల్పడిన ఘటన పట్టణంలో చోటు చేసుకుంది. మంగళవారం పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో సీఐ శశిధర్‌రెడ్డి, ఎస్సై రాజశేఖర్‌తో కలిసి వివరాలు వెల్లడించారు. పట్టణంలోని పాత సీఎస్పీ రోడ్డులో నివాసం ఉంటున్న కందుల కుమార్ కొంతకాలంగా దీర్ఘకాలిక వ్యాధితో బాధపడుతున్నాడు. విషయం బయటకు తెలియడంతో కుటుంబంతో సహా వెళ్లి ఆర్కే–5 ఏరియాలోని నస్పూర్ కాలనీలో ఉంటున్నాడు. నాలుగు రోజుల క్రితం తెలిసిన వారింట్లో పెళ్లి ఉండడంతో పాత సీఎస్పీ రోడ్డులోని తల్లిగారింటికి వచ్చాడు. సోమవారం రాత్రి అతిగా మద్యం సేవించి సమీపంలోని రాంబాయి ఇంటికి వెళ్లి నీళ్లు కావాలని అడిగాడు. ఆమె కుమారుడు రవికుమార్ నీళ్లు ఇవ్వడంతో తాగి వెళ్లిపోయాడు. కొంతసేపటికి మళ్లీ వచ్చి నీళ్లు అడగడంతో రాంబాయి లేవని సమాధానం చెబుతూ ఖాళీ బిందెను చూపించింది. నాకు వ్యాధి ఉందనే కదా మీరు నీళ్లు ఇవ్వడంలేదని కోపంతో బయటకు వెళ్లిన కుమార్ గొడ్డలి తీసుకువచ్చి దాడికి పాల్పడ్డాడు. పోలీసులకు సమాచారం అందించడంతో గాయపడిన మహిళను మంచిర్యాల ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లగా వైద్యుల సూచన మేరకు మెరుగైన చికిత్సకోసం వరంగల్ తరలించారు. రవికుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు మంగళవారం జాతీయ రహదారి టోల్‌గేట్ వద్ద అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించారు.

కార్మికుల డిమాండ్లు నెరవేర్చాలి


అధికారులతో చర్చిస్తున్న గుర్తింపు సంఘం నాయకులు

శ్రీరాంపూర్: కార్మికుల డిమాండ్లు నెరవేర్చాలని గుర్తింపు సంఘం ఏఐటీయూసీ నాయకులు యజమాన్యాన్ని కోరారు. మంగళవారం శ్రీరాంపూర్ జీఎం కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్లో ఏరియా స్థాయి స్ట్రక్చరల్ సమావేశం జరిగింది. జీఎం శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో గుర్తింపు సంఘం నుండి ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి షేక్ బాజీసైదా, సహాయ కార్యదర్శి మోత్కూరీ కొమురయ్య, తదితరులు హాజరై సమస్యలపై చర్చించారు. శ్రీరాంపూర్ ఓసీపీలో జీఎల్ బంకర్, సైట్ ఆఫీస్ వద్ద మరుగుదొడ్లు, తాగునీటి కోసం ఆర్వో ప్లాంట్ ఏర్పాటు చేయాలని, ఇందారం 1ఏ గనిపై కార్మికులకు స్నానం గదులను ఏర్పాటు చేయాలని కోరారు. సమావేశంలో ఏరియా ఎస్‌ఓటు జీఎం సత్యనారాయణ, ఏజీఎం (ఫైనాన్స్) భీబత్సా, ఓసీపీ పీఓలు టీ శ్రీనివాస్, ఏవీ రెడ్డి, ఏరియా ఇంజనీర్ చంద్రశేఖర్ రెడ్డి, ఏరియా రక్షణ అధికారి శ్రీధర్ రావు, డీజీఎంలు అరవిందరావు, ఆనంద్ కుమార్, ఏజెంట్లు శ్రీధర్, రాజేందర్, వెంకటేశ్వర్లు, అధికారులు డాక్టర్ రమేశ్‌బాబు, మల్లయ్య, కిరణ్ కుమార్, దేవేందర్ రెడ్డి, ఏఐటీయూసీ నాయకులు కొట్టే కిషన్ రావు, ప్రసాద్ రెడ్డి, నరసయ్య, రాంచందర్ పాల్గొన్నారు.

యువతి ఆత్మహత్య


సౌమ్య(ఫైల్)

శ్రీరాంపూర్: ఉరేసుకుని యువతి ఆత్మహత్య చేసుకున్న సంఘటన పట్టణంలో చోటు చేసుకుంది. ఎస్సై సంతోష్ తెలిపిన వివరాల మేరకు శ్రీరాంపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఆర్కే 6 హట్స్ ఏరియాకు చెందిన మేరుగు సౌమ్య (22) కొంతకాలం ప్రైవేటు ఉద్యోగం చేసి ప్రస్తుతం ఇంట్లోనే ఉంటోంది. యువతి తండ్రి కొంతకాలం క్రితం మృతి చెందగా తల్లి కీర్తనతో కలిసి ఉంటుంది. సోమవారం సాయంత్రం కీర్తన సంతకు వెళ్లిన సమయంలో సూసైడ్ నోట్ రాసి ఇంటి పైకప్పుకు ఉరేసుకుంది. తనకు పెళ్లంటే ఇష్టం లేదని, జీవితంలో ఇంకో స్టెప్ తీసుకోలేనని అందుకే ఆత్మహత్య చేసుకుంటున్నానని, సారీ మమ్మీ.. సారీ డాడి అని లేఖలో రాసి ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి తల్లి కీర్తన ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

'సైబర్' కుట్ర భగ్నం

- ఆరుగురు అంతర్రాష్ట్ర ముఠా సభ్యులపై కేసు
- పోలీసుల అదుపులో ఐదుగురు నిందితులు
- 2,125 పాత మొబైళ్లు, 107 సిమ్ కార్డులు, 600 మొబైల్ బ్యాటరీలు, 5 వాహనాలు సీజ్
- వివరాలు వెల్లడించిన ఆదిలాబాద్ ఎస్పీ అఖిల్ మహాజన్


వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ అఖిల్ మహాజన్

ఆదిలాబాద్‌టౌన్: సైబర్ నేరాలకు పాల్పడాలనే భారీ కుట్రను ఆదిలాబాద్ జిల్లా పోలీసులు భగ్నం చేశారు. అంతర్రాష్ట్ర సైబర్ నేరస్తులను టూటౌన్, సైబర్‌క్రైం పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి మొబైల్ ఫోన్లు, సిమ్ కార్డులు, ద్విచక్ర వాహనాలు, మొబైల్ బ్యాటరీలను స్వాధీనం చేసుకుని ఆరుగురిపై కేసు నమోదు చేశారు. ఒకరు పరారీలో ఉండగా, ఐదుగురిని అరెస్టు చేశారు. ఎస్పీ అఖిల్ మహాజన్ మంగళవారం జిల్లా కేంద్రంలోని పోలీస్ హెడ్‌క్వార్టర్‌లోని సమావేశ మందిరంలో ఇందుకు సంబంధించిన వివరాలు వెల్లడించారు. బిహార్ రాష్ట్రంలోని కాతిహార్ జిల్లా హతియదిర గ్రామానికి చెందిన ఆరుగురు ముఠాగా ఏర్పడి దేశ వ్యాప్తంగా సైబర్ నేరాలకు పాల్పడడానికి కుట్ర పన్నినట్లు తెలిపారు. ఇందులో ఏ–1గా ఉన్న తబారక్ మిగతా ఐదు గురిని బైక్‌లపై తెలంగాణ రాష్ట్రానికి పంపించాడు. వారు పాత మొబైళ్ల తీసుకొని ప్లాస్టిక్ డబ్బాలు ఇస్తామంటూ పట్టణాలు, పల్లెల్లో తిరిగారు. పాత మొబైళ్ల సిమ్‌కార్డు, బ్యాటరీలను సేకరించారు. వాటిద్వారా వివిధ రాష్ట్రాల్లోని ప్రజలకు బ్యాంక్ అధికారులంటూ ఫోన్ చేసి సైబర్ బారిన పడే విధంగా కుట్ర పన్నారు. వారి కుట్రను ఆదిలాబాద్ పోలీసులు భగ్నం చేసినట్లు ఎస్పీ పేర్కొన్నారు. నిందితులు మహ్మద్ మెరాజుల్, మహెబూబ్ ఆలం, మహ్మద్ జమాల్, ఎండీ ఉజీర్, అబ్దుల్లాను అరెస్టు చేయగా ఏ–1 నిందితుడు తబారక్ పరారీలో ఉన్నట్లు తెలిపారు. అరెస్టయిన వారి వద్ద నుంచి 2,125 పాత మొబైల్ ఫోన్లు, 107 సిమ్ కార్డులు, ఐదు ద్విచక్ర వాహనాలతో పాటు వారు వినియోగించే మొబైల్ ఫోన్‌లు, 600 మొబైల్ బ్యాటరీలను స్వాధీనం చేసుకుని టూటౌన్ పోలీసు స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్లు తెలిపారు. కుట్ర భగ్నం చేసిన సైబర్ డీఎస్పీ హసీబుల్లా, ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్.జీవన్‌రెడ్డి, టూటౌన్ సీఐ కరుణాకర్‌రావు, సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్‌ను ఎస్పీ అభినందించారు.

అమ్మా.. నీ తప్పుకు నన్ను చంపేశావా?


పసికందు మృతదేహం

'అమ్మా.. ఇంకో మూడు నెలలైతే లోకం చూసేవాడిని కదమ్మా.. ఎందుకమ్మ ఇంత పనిచేశావు. నీ కడుపులో నన్ను మోయలేక పోయావా.. ఆరు నెలలుగా నీ కడుపులో హాయిగా పెరుగుతున్నా.. నీవు మింగిన మాత్రలకు నాకు ఊపిరి ఆడడం లేదమ్మా.. లోకం చూపించి అనాథాశ్రమంలో పడేసినా బాగుండేది.. తెల్లవారేసరికే నా ఊపిరి తీశావేంటమ్మా.. నీవు చేసిన తప్పుకు నన్ను బలి ఇచ్చావా..'

- గురుజలో ఆరు నెలల పిండం
- కడుపులోనే చంపి.. వాగులో పడేసి..
- విచారణ జరుపుతున్న పోలీసులు...

గుడిహత్నూర్: ఆదిలాబాద్ జిల్లా గుడిహత్నూర్ మండలంలోని గురుజ వాగులో పడేసిన పిండానికి మాటలు వస్తే ఇలాగే ప్రశ్నించేదేమో. క్షణికావేశంలో చేసిన తప్పుకు గర్భం దాల్చిన ఓ యువతి.. బయటి ప్రపంచానికి ఆ విషయం తెలియకుండా ఉండేందుకు ఆరు నెలల గర్భంలోనే పిండాన్ని చంపేశారు. ఈ హృదయ విదారక సంఘటన గురుజ గ్రామంలో చోటు చేసుకుంది. పోలీసులు, గ్రామస్తులు తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి... మంగళవారం ఉదయం గ్రామ శివారులోని వాగు ప్రాంతానికి బహిర్భూమికి వెళ్లిన కొందరు గ్రామస్తులకు మృత శిశువు కనిపించింది. పోలీసులకు సమాచారం అందించడంతో ఎస్సై మహేందర్ సంఘటనా స్థలానికి చేరుకొని శిశువు మృతదేహాన్ని రిమ్స్‌కు తరలించారు. ఈ ఘటనపై విచారణ చేపట్టారు. స్థానికులు అందించిన వివరాలను సేకరించి ఉన్నతాధికారులకు సమాచారం అందించారు. కేసు నమోదు చేసుకొని వెంటనే దర్యాప్తు చేపట్టారు. ఈ క్రమంలో ఓ యువతి, ఇద్దరు యువకులతోపాటు ఆర్‌ఎంపీని అదుపులోని తీసుకున్నట్లు తెలిసింది. పెళ్లి కాకుండానే గర్భం దాల్చిన ఓ యువతి.. ఆరు నెలల గర్భాన్ని తీయించుకునేందుకు ఆర్‌ఎంపీని ఆశ్రయించినట్లు సమాచారం. మంగళవారం రాత్రి గ్రామంలో తిరిగిన సదరు ఆర్‌ఎంపీ ప్రాణాపాయమని తెలిసినా.. ఆరు నెలల గర్భాన్ని తొలగించారు. ఆ పిండాన్ని ఇలా వాగులో పడేసి ఉంటారని ప్రచారం జరుగుతోంది. దర్యాప్తు పూర్తి కానందున పూర్తి వివరాలు బుధవారం అందిస్తామని సీఐ భీమేష్ తెలిపారు. మృత శిశువును పరీక్షించిన వైద్యులు మగ శిశువుగా నిర్ధారించారు. పిండం వయస్సు సుమారు 6 నెలలు దాటి ఉండవచ్చని సమాచారం.